ఓపెనర్‌గా రాహుల్!

అనధికారిక టెస్టులో ప్రయోగం • నేటి నుంచే భారత్ 'ఏ', ఆస్ట్రేలియా 'ఏ' రెండో మ్యాచ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా పర్యటన కంటే ముందే అక్కడకు వెళ్లిన టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్.. గురువారం నుంచి ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) వేదికగా ఆసీస్ 'ఏ'తో జరుగబోయే అనధికారిక రెండో టెస్టులో భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. ఈనెల 22 నుంచి కంగారూలతో తొలి టెస్టు జరగాల్సి ఉండగా ఆ మ్యాచ్‌కు సారథి రోహిత్ శర్మ అందుబాటులో ఉండేది అనుమానమేనన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో యశస్వీ జైస్వాల్‌కు జంటగా రాహుల్‌ను ఆడించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే రాహుల్‌ను ముందుగానే ఆస్ట్రేలియాకు పంపిన మేనేజ్‌మెంట్.. గురువారం మ్యాచ్‌లో అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ఆరంభించే బాధ్యతలను రాహుల్‌కు అప్పజెప్పినట్టు సమాచారం. బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో విఫలమైన రాహుల్.. న్యూజిలాండ్‌తో బెంగళూరు టెస్టులో ఆడినా ఆ మ్యాచ్‌లో విఫలమై తర్వాతి రెండు టెస్టులకూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో అనధికారిక టెస్టులో అతడు ఏ మేరకు రాణించగలడు? అనేది ఆసక్తికరంగా మారింది. ఓపెనర్‌గా రావడం రాహుల్‌కు కొత్తేం కాదు. 2015-23 మధ్యకాలంలో 75 ఇన్నింగ్స్‌లలో ఓపెనర్‌గా వచ్చిన రాహుల్.. 34.94 సగటుతో 2,551 పరుగులు సాధించాడు. కేఎల్ రాహుల్‌తో పాటు ధ్రువ్ జురెల్ కూడా ఆస్ట్రేలియా పయనమవగా తొలి మ్యాచ్‌లో బాల్ టాంపరింగ్ ఆరోపణలు ఎదుర్కొన్న ఇషాన్ కిషన్ స్థానంలో అతడిని ఆడించే అవకాశాలున్నాయి.

మార్పులు, చేర్పులతో

ఆసీస్ 'ఏ'తో వామప్ మ్యాచ్ కోసం భారత్ 'ఏ' మార్పులు, చేర్పులతో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తున్నది. బుధవారం ఎమ్‌సీజీలో జరిగిన నెట్ ప్రాక్టీస్‌లోరాహుల్ మంచి టచ్‌మీద కనిపించాడు. బాబా ఇంద్రజిత్ స్థానంలో రాహుల్ జట్టులోకి రానున్నాడు. మకాయ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లో ఇంద్రజిత్ 9, 6 స్కోర్లతో తీవ్రంగా నిరాశపరిచాడు. దీనికి తోడు పేస్, బౌన్సీ పిచ్‌లపై 125కి.మీ వేగంతో కూడిన బంతులను ఆడటంలో ఇంద్రజిత్ తడబడ్డాడు. ఇషాన్ కిషన్‌కు బదులుగా జురెల్ రాక ఖరారు కాగా, పేసర్ సైనీ స్థానంలో ఖలీల్ తుది జట్టులో ఆడనున్నాడు. పెర్త్(22 తేదీ) పోరుకు ముందు భారత్ 'ఏ'కు ఇది కీలకం కానుంది.

22వ ర్యాంక్‌కు విరాట్ కోహ్లీ

• పదేండ్లలో ఇదే ప్రథమం

దుబాయ్: రన్‌మిషీన్ విరాట్ కోహ్లీ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్(బ్యాటింగ్)లో మరింత దిగజారాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో ముగిసిన మూడు టెస్టుల సిరీస్‌లో ఆరు ఇన్నింగ్స్‌లలో కలిపి 93 పరుగులే చేసిన విరాట్.. ఐసీసీ బుధవారం విడుదల చేసిన టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో 8 స్థానాలు దిగజారి 22వ స్థానానికి పడిపోయాడు. 2014 ఇంగ్లండ్ సిరీస్ వైఫల్యం తర్వాత (నాడు 24వ స్థానం) కోహ్లీ ర్యాంకు ఈ స్థాయిలో పడిపోవడం ఇదే ప్రథమం. టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మ కూడా 2 స్థానాలు దిగజారి 26వ స్థానంలో ఉన్నాడు. యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ 5 స్థానాలు మెరుగుపరుచుకుని 6వ స్థానంలో నిలిచి మరోసారి టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. ఈ జాబితాలో జో రూట్, కేన్ విలియమ్సన్ తొలి రెండు ర్యాంక్‌ల్లో ఉండగా యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఒక ర్యాంక్ దిగజారి 4వ ర్యాంకుతో సరిపెట్టుకున్నాడు. బౌలర్ల జాబితాలో రబాడా అగ్రస్థానంలో కొనసాగుతుండగా హెజిల్‌వుడ్, బుమ్రా, కమిన్స్, అశ్విన్, జడేజా టాప్-6లో ఉన్నారు.

ట్రంప్ విన్.. తలా ఫర్ ఏ రీజన్

ముంబై: ఐదేండ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా దిగ్గజ సారథి మహేంద్ర సింగ్ ధోనీకి సోషల్ మీడియాలో ఫాలోయింగ్ ఏమాత్రం తగ్గలేదు. అతడికి సంబంధించిన అంశమేదీ వచ్చినా నెట్టింట అతడి అభిమానులు 'తలా ఫర్ ఏ రీజన్' అనే హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లోకి వస్తుంది. తాజాగా అమెరికా అధ్యక్ష ఎన్నికలలో డొనాల్డ్ ట్రంప్ గెలవడంతో ఈ హ్యాష్ ట్యాగ్ మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చింది. ధోనీ అభిమానులు గతంలో అతడు ట్రంప్‌తో కలిసి గోల్ఫ్ ఆడిన ఫొటోను షేర్ చేస్తున్నారు. అదీగాక అమెరికా ఎన్నికల ఫలితం వెలువడిన తేదీ (6/11/2024..6+1+1+2+2+4=16.. 1+6=7)ని కూడితో వచ్చే సంఖ్య కూడా ధోనీ జెర్సీ నంబర్ అవడంతో ఈ హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతున్నది.

ఐపీఎల్ వేలంలోకి అండర్సన్

ముంబై: కొద్దిరోజుల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఇంగ్లండ్ దిగ్గజ బౌలర్ జేమ్స్ అండర్సన్.. తొలిసారి ఐపీఎల్ వేలంలో పేరు నమోదు చేసుకున్నాడు. ఇంతవరకూ ఫ్రాంచైజీ క్రికెట్ (టీ20) ఆడని అండర్సన్.. ఇంగ్లండ్ తరపున 2014లో చివరిసారి ఆడాడు. 42 ఏండ్ల ఈ దిగ్గజ పేసర్.. రూ. 1.25 కోట్ల కనీస ధరతో తన పేరును నమోదుచేసుకున్నాడు. రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, అశ్విన్, చాహల్‌తో పాటు వెంకటేశ్ అయ్యర్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీ, ఇషాన్ కిషన్ వంటి భారత స్టార్ ఆటగాళ్లు రూ. 2 కోట్ల కనీస ధరతో వేలంలోకి రానున్నారు. ఈ ఏడాది జూన్‌లో ముగిసిన టీ20 వరల్డ్ కప్‌లో మెరిసిన భారత సంతతి అమెరికా పేసర్ నేత్రవల్కర్ సైతం ఐపీఎల్ ఆడేందుకు ఆసక్తి చూపుతున్నాడు. రూ.30 లక్షల కనీస ధరతో అతడు వేలంలో పేరు నమోదు చేసుకున్నాడు. అంతేగాక ఈసారి ఆక్షన్‌లో ఇటలీ ఆటగాడు థామస్ డ్రాకా కూడా అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు.

స్పోర్ట్స్ పాలసీతో క్రీడారంగంలో మార్పులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: స్పోర్ట్స్ పాలసీతో తెలంగాణ క్రీడారంగంలో మార్పులు రాబోతున్నాయి. బుధవారం గచ్చిబౌలి స్టేడియంలో సాట్స్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ పాలసీ, స్పోర్ట్స్ హబ్, సీఎం కప్ నిర్వహణపై ప్రధానంగా చర్చ జరిగింది. సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి అధ్యక్షతన జరిగిన భేటీలో ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాల సభ్యులు ప్రాతిపాదిత స్పోర్ట్స్ పాలసీలో ముఖ్య అంశాలతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఏఏ విభాగాలు ఏర్పాటు చేయబోతున్నారో వివరించారు. వివిధ టోర్నీల్లో తెలంగాణ క్రీడాకారుల ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుంటూ నగదు ప్రోత్సహకాలను, ఉద్యోగ అవకాశాలను నూతన స్పోర్ట్స్ పాలసీలో స్పష్టం చేయబోతున్నట్లు చైర్మన్ తెలిపారు.

కొత్త ఇంటికి రింకూ

• రూ. 3.5 కోట్లతో కొనుగోలు

అలీగఢ్: టీమ్‌ఇండియా యువ సంచలనం, ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తరపున ఆడే రింకూ సింగ్ కొత్త ఇంటికి మారాడు. అలీగఢ్‌లోని ఓ నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగిన రింకూ స్థానికంగా ఉన్న గోల్డెన్ ఎస్టేట్ లోని ఓజోన్ టౌన్‌షిప్‌లో రూ. 3.5 కోట్ల విలువ చేసే బంగ్లాను కొనుగోలు చేశాడు. 500 స్క్వేర్ యార్డ్స్ విస్తీర్ణంలో నిర్మించిన ఈ బంగ్లాను రింకూ గత వారమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో కేకేఆర్.. రింకూను ఏకంగా రూ. 13 కోట్లతో టాప్-1 రిటెన్షన్‌గా అట్టిపెట్టుకున్న విషయం తెలిసిందే. గతంలో రింకూ తండ్రి స్థానికంగా ఎల్‌పీజీ సిలిండర్లు సరఫరా చేయగా అతడి సోదరుడు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవారు.

టైటాన్స్ అదుర్స్

తమిళ్ తలైవాస్‌పై ఉత్కంఠ విజయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో మరోపోరు అభిమానులను కట్టిపడేసింది. గచ్చిబౌలి స్టేడియం వేదికగా బుధవారం హోరాహోరీగా సాగిన పోరులో తెలుగు టైటాన్స్ 35-34 తేడాతో తమిళ్ తలైవాస్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. పీకేఎల్-8వ సీజన్ తర్వాత తలైవాస్‌పై టైటాన్స్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. టైటాన్స్ తరపున స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్ 12 పాయింట్లతో అదరగొట్టగా, అశిష్ నార్వల్(9), విజయ్ మాలిక్(4) ఆకట్టుకున్నారు. మరోవైపు తలైవాస్ జట్టులో సచిన్ 17 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచినా జట్టును గెలిపించలేకపోయాడు. పీకేఎల్‌లో 1000 పాయింట్ల క్లబ్‌లో సచిన్ తాజాగా చేరాడు. వరుసగా హ్యాట్రిక్ విజయంతో టైటాన్స్ 21 పాయింట్లతో 4వ స్థానంలోకి దూసుకురాగా, తలైవాస్ 21 పాయింట్లతో మూడులో ఉంది. మరో మ్యాచ్‌లో యూ ముంబా 42-40తో పాట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్‌కు గురుకుల విద్యార్థులు

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు చెందిన 18మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అండర్-14 విభాగంలో సిద్ధు, చరంజిత్, హిమాన్షు, కార్తికేయ, 17 ఏళ్ల విభాగంలో శ్రీవత్స , అరవింద్, రాము, పాల్ సురేష్, శివ, అభిలాష్, హేమంత్, మనోహర్, చంద్రశేఖర్, రామ్‌చరణ్, టిస్విక్ వర్మ, అభిరానంద్, సిద్ధార్థ, అనిల్ కుమార్ తదితరులున్నారు. రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సొసైటీ సెక్రటరీ వర్షిణి, ఇతర ఉన్నతాధికారులు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటాలని అభిలాషించారు.

శ్రేయస్ శతకం

ముంబై: భారత క్రికెట్ జట్టులోకి రీఎంట్రీ ఇవ్వాలని ఎదురుచూస్తున్న శ్రేయస్ అయ్యర్ (164 బంతుల్లో 152 నాటౌట్, 18 ఫోర్లు, 4 సిక్సర్లు) రంజీ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే శతకంతో సత్తా చాటాడు. ముంబై వేదికగా ఒడిషాతో జరుగుతున్న మ్యాచ్‌లో శ్రేయస్.. ఆది నుంచే వన్డే తరహా ఇన్నింగ్స్ ఆడి స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. అతడికి సిద్ధేశ్ (116 నాటౌట్) జతకలవడంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ముంబై 3 వికెట్లు కోల్పోయి 385 పరుగులు చేసి భారీ స్కోరు దిశగా కదులుతోంది.

హైదరాబాద్ 261/5

జైపూర్: కెప్టెన్ రాహుల్ సింగ్ (66), వికెట్ కీపర్ రాహుల్ రాధేశ్ (43 బ్యాటింగ్) ఆదుకోవడంతో రాజస్థాన్‌తో జైపూర్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ తొలిరోజు 5 వికెట్ల నష్టానికి 261 పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (40) రాణించాడు. రాధేశ్‌తో పాటు అజయ్‌దేవ్ గౌడ్ (34 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

టాప్‌లోకి వ్యాలీ వారియర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ నాలుగో సీజన్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండో రౌండ్‌లో వ్యాలీ వారియర్స్ అద్భుత ప్రదర్శనతో అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. మొత్తంగా 165 పాయింట్లతో ఓవరాల్‌గా ఆరో స్థానంలో కొనసాగుతున్నది. వారియర్స్ టీమ్ గోల్ఫర్లు అరవింద్ మహాలింగం, కరణ్‌బీర్‌సింగ్ 47 పాయింట్లు సాధించారు.

అర్జున్ దూకుడు

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ దూకుడు కొనసాగుతున్నది. టోర్నీలో రెండో అత్యుత్తమ ర్యాంకర్‌గా పోటీకి దిగిన అర్జున్..అమెరికా గ్రాండ్‌మాస్టర్ లెవాన్ ఆరోనియన్‌తో బుధవారం జరిగిన గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్..ఆరోనియన్‌కు దీటైన పోటీనిచ్చాడు. సాధ్యానిపై గెలిచి వైశాలి పాయింట్ల ఖాతా తెరిచింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.